# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-06-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతిని దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

2. **ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభిస్తారు**

3. **ఆంధ్రప్రదేశ్ లో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర పునరుత్పాదక శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.**

4. **ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.**

==========================

అమరావతిని విద్యా, విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయడంతో పాటు దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానం చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. వచ్చే ఏడాది విశాఖపట్నంలో నిర్వహించనున్న పార్టనర్షిప్ సమ్మిట్‌కు సన్నాహకంగా సింగపూర్‌లో భారత పరిశ్రమల సమాఖ్య నిర్వహించిన –సిఐఐ బిజినెస్ రోడ్‌షోలో ముఖ్యమంత్రి నిన్న పాల్గొన్నారు. రాష్ట్రంలో పర్యాటకం, ఆక్వా, వ్యవసాయం, ఉద్యానం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరినీ వ్యాపారవేత్తలుగా మార్చేందుకు ఒక కుటుంబం – ఒక పారిశ్రామిక వేత్త విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

--------------------------

ప్రభుత్వ విద్యను బలోపేతం చేసే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఈరోజు ప్రారంభిస్తారు. రంగారెడ్డి జిల్లా ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ పాఠశాల పైలాన్‌ను ఆవిష్కరించి డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, సైన్స్ ల్యాబ్స్, డైనింగ్ హాల్, క్రీడా మైదానాలను పరిశీలించనున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ సభ్యులతో సమావేశమై వారి అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించనున్నారని అధికారులు తెలిపారు. నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు

అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యతో కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేసింది.

---------------------------

కేంద్ర పునరుత్పాదక శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విజయవాడలోని రాయనపాడు శాటిలైట్ రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను నిన్న పరిశీలించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ, భారతీయ రైల్వేలో విద్యుదీకరణ వేగంగా సాగుతోందని, ఆంధ్రప్రదేశ్ లో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. రాజధాని అమరావతికి రైల్వే అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రహ్లాద్ జోషి వివరిస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి  కె.పవన్ కళ్యాణ్ ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్ పాటిల్ తో  నిన్న సమావేశమయ్యారు. ఈ సమావేశంలో నీటి కొరత నివారణ, నదుల పరిరక్షణ, అలాగే జల వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలపై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ లో ప్రజలకు స్థిరంగా తాగునీటిని అందించేందుకు మరింత సమర్థవంతమైన చర్యలు అవసరమని పేర్కొన్నారు. అంతకు ముందు కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌తో సమావేశమై ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ అభివృద్ధికి సంబంధించిన పనులకు సహకారం అందించాలని కోరారు. అనంతరం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ,

వాయిస్..30..  సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువుల కొరత లేదని, రైతులకు సకాలంలో ఎరువులు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు నిన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఎరువుల బస్తాలు రైతులకు పంపిణీ చేశామని చెప్పారు. రాయలసీమలో ఉద్యాన పంటలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పండ్ల ఉత్పత్తిలో,  సూక్ష్మసేద్యం అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలో అగ్రస్థానంలో కొనసాగుతోందని అన్నారు. 22 లక్షలకు పైగా వ్యవసాయ పంపుసెట్లకు రోజుకు తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిటెక్నిక్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష–ఏపీపీఈసెట్–2026 ఫలితాలను విద్యా శాఖ విడుదల చేసింది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్  సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఈ ఫలితాలను విడుదల చేశారు. ఈ పరీక్షలో 89.76 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. మొత్తం 2 వేల 958 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 2 వేల 655 మంది అర్హత సాధించారని చెప్పారు. విద్యార్థులు తమ ఫలితాలను  అధికారిక వెబ్‌సైట్‌తో పాటు 'మన మిత్ర' వాట్సాప్ సేవ ద్వారా కూడా తెలుసుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు.

---

క్రీడలను ప్రోత్సహించడం, యువ క్రీడాకారులకు అవకాశాలు కల్పించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో హెచ్ఎస్‌బీసీ రగ్బీ ప్రీమియర్ లీగ్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రగ్బీ ప్రీమియర్ లీగ్‌లో ఆరు పురుషుల జట్లతో పాటు నాలుగు మహిళల జట్లు పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. ఇది రగ్బీ క్రీడ అభివృద్ధికే కాకుండా దేశంలో మహిళా క్రీడాకారుల ప్రోత్సాహానికి కూడా ఒక ముఖ్యమైన ముందడుగని అన్నారు.

---

జాతీయవాది, దేశభక్తులు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మి నరసింహం వర్ధంతి ఈరోజు. 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ప్రస్తుత పశ్చిమగోదావరి జిల్లా ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు. ద్రౌపది పరిణయం, శ్రీరామ జననం వంటి నాటికలు, రామచంద్ర విజయం, హేమలత వంటి నవలలు రాసిన ఆయన మహాకవి, కళాప్రపూర్ణ అనే బిరుదులు పొందారు. ఆయన రచించిన గణపతి నవల హాస్య రచనలలో ప్రసిద్ధి పొందింది. “భరత ఖండంబు చక్కని పాడియావు” పద్యంతో ప్రసిద్ధి పొందిన లక్ష్మీ నరసింహం 1946 జూన్ 17వ తేదీన కన్నుమూశారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్ని ప్రభుత్వం పరిష్కారించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆక్వా రైతులు, ప్రతినిధులతో ఆయన నిన్న సమావేశమయ్యారు ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో ఆక్వా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి, నాణ్యత నియంత్రణ కోసం పలు ప్రయోగశాలలను ఏర్పాటు చేశామని చెప్పారు. పెరిగిన ఆక్వా మేత ధరలను ఈ నెలాఖరులోగా తగ్గించాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

---

ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగిలో నిర్మాణంలో ఉన్న గిరిజన స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం పనులను కేంద్ర, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖల ఉన్నతాధికారులు నిన్న పరిశీలించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ దీపాలి మాసిర్కర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.ఎం. నాయక్ నేతృత్వంలోని బృందం మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలించి సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మ్యూజియం ప్రధాన ఆకర్షణగా నిలిచే చిత్రకళ పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన వీరుల చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించేలా ప్రదర్శన విభాగాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని సూచించారు.

---

తూర్పు విదర్భ, తెలంగాణగా మీదుగా దక్షిణ కోస్తాంధ్ర ఆంధ్రప్రదేశ్ వరకు ఉపరితల ద్రోణి విస్తరించి ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లోని కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రానున్న రెండు రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం